క్లుప్తంగా

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు



అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ సర్వే నం.244లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను కమిషనర్ రామలింగం ఆదేశాల మేరకు టీపీఎస్ స్రవంతి సిబ్బందితో కలిసి కూల్చివేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భారీ అంతస్తుల నిర్మాణానికి నోటీసులు జారీ చేశామన్నారు. అదేవిధంగా రోడ్డుపై నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ వేయడంతో రూ. 5వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ పాండు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో 'నూతన' వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, టీఎన్‌జీవోస్ జిల్లా ప్రతినిధులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్‌లో నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజావాణి హాలులో 'న్యూ ఇయర్ కేక్'ను జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) అభిషేక్ ఆగస్త్య కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏనుగు నర్సింహారెడ్డి, డీఆర్ఓ లింగ్యానాయక్,వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు రవీందర్, ఝాన్సీరాణి,పద్మజారాణి, డాక్టరు శ్రీనివాస్, లింగస్వామి రాజేందర్, మేరీరేఖ, నాగాంజలి, వినోద్‌కుమార్, రాంచందర్, బలరామారావు, వేణుగోపాల్‌రెడ్డి, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు రవిప్రకాష్, టీఎన్‌జీవోస్ జిల్లా నాయకులు ఈశ్వర్, హరి, జేమ్స్, దాస్,రవి కుమార్, కె.భాస్కర్, గిరి కాంత్, రాంచంద్రం,అరుణ,శ్రీనివాస్, సత్యం, ప్రకాష్, నజీమ్, జెర్మియాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ... 2023 సంవత్సరంలో ఉద్యోగులందరికీ మంచి ఆరోగ్యం, సంతోషం, విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

ప్రజావాణిలో 69 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు, దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు సత్వరమే వాటిని పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి 69 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనివల్ల దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వచ్చే ప్రజలకు అధికారులపై మరింత నమ్మకం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అంతరం జిల్లా అధికారులు అదనపు కలెక్టర్లకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లు




పతకాలు, ప్రశంస పత్రాలతో నర్గిస్ సుల్తానా, నఫీస్ సుల్తానా

మల్లాపూర్: దేశవ్యాప్తంగా ప్రతిభగల విద్యార్థులకు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ ముస్లింస్ ఆఫ్ ఇండియన్ వర్జిన్స్ ఆధ్వర్యంలో హైయర్ సెకండరీ స్కూల్ సర్టిఫికెట్లను ప్రతి ఏడాది అందజేస్తోంది. తెలంగాణ రాష్ట్ర నుంచి నాచారం (ఉప్పల్ గర్ల్స్) తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కాలేజీకి చెందిన ఇద్దరూ విద్యార్థినులు అక్క చెల్లెలు నర్గిస్ సుల్తానా, నఫీస్ సుల్తానా ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో నర్గిస్ సుల్తానాకు బంగారు పతకం, ప్రశంసపత్రం, నఫీస్ సుల్తానాకు రజత పతకంతో పాటు ప్రశంస పత్రాన్ని ఢిల్లీ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యులు సయ్యద్ షాజుదీ చేతుల మీదుగా అందుకున్నారు. తన పిల్లలు ప్రతిభ కనబర్చడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థినుల తండ్రి మహ్మద్ అబ్దుల్ సలాం పేర్కొన్నారు.

చిదానంద రూపం.. మనోజ్ఞ స్వరూపం..

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు



వైకుంఠ (ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం మేడ్చల్ నియోజకవర్గంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేక పూజలో పాల్గొన్నారు. ఉదయం ఆలయ వేదపండితులు ఉత్తరద్వారం గుండా భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులతో వైష్ణవ దేవాలయాలు కిటకిటలాడాయి. విష్ణు నామస్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.







చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవాలయం వద్ద క్యూలో భక్తులు

ఉత్తరద్వారం నుంచి దర్శించుకుంటే అన్నీ శుభాలే..





కీసర: వైకుంఠ ఏకాదశి రోజు ఉత్తర ద్వారం గుండా లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుంటే శుభం కలుగుతుందని భక్తుల విశ్వాసం. దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలతో పాటు కీసర మండలంలోని వైష్ణవ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చీర్యాలలో ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, ధర్మకర్తలు అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు ఉత్తరద్వార దర్శన భాగ్యం కల్పించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ కుటుంబసమేతంగా వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బాబూ మోహన్‌కు స్వామీవారి చిత్రపటాన్ని ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. అయ్యప్పకాలనీ శ్రీఅండాలు సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అహ్మద్‌గూడ ప్రజయ్‌సాయిగార్డెన్‌లోని రామాలయంలో ముక్కోటి ఏకాదశి పూజలు కనుల పండువగా జరిగాయి.

తులసీదళాలు, పుష్పాలతో అర్చనలు

ఘట్‌కేసర్: ముక్కోటి ఏకాదశి వేడుకలు సోమవారం కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఘట్‌కేసర్, ఎదులాబాద్, వెంకటాపూర్‌లలోని ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు తరలిరావడంతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో భక్తులు ఆలయ ఉత్తర ద్వారం నుంచి లోపలకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి చందనం, పుష్పాలు, తులసీ దళాలతో అర్చనలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి హారతులిచ్చి గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్, వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వెంకటాపూర్ ఆలయ చైర్మన్ వేణుగోపాల్‌ముదిరాజ్, సర్పంచులు గీత, వెంకటేశ్‌గౌడ్, సురేశ్, ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, సరళ, మాజీ ఎంపీటీసీలు కుమార్‌ముదిరాజ్, రవి, ఉప సర్పంచులు సత్యనారాయణ, లింగేశ్వర్, రాజు, కార్యదర్శి ఉష, శ్రీనివాస్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, సుధాకర్‌రెడ్డి, శేఖర్ పూజల్లో పాల్గొని దర్శించుకున్నారు.



వెంకటాపూర్‌లో జరిగిన పూజలో జెడ్పీచైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



శ్రీగోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామికి హారతులు ఇస్తున్న భక్తులు

కిక్కిరిసిన వైష్ణవ ఆలయాలు

మేడ్చల్: వైకుంఠ ఏకాదశి పండగను మేడ్చల్ మండలం, మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలోని వైష్ణవ ఆలయాల్లో భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయాల కమిటీలు తగు ఏర్పాట్లు చేశాయి. అత్వెల్లి వేంకటేశ్వరాలయం, జయదర్శిని వెంకటేశ్వరాలయం, మేడ్చల్ రంగనాయకస్వామి, గుండ్ల పోచంపల్లి లక్ష్మీనారాయణ,అయ్యప్ప ఆలయం, గౌడవెల్లి రామానుజ స్వామి, ఘనాపూర్ క్షేత్రగిరి వేంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అత్వెల్లి ఆలయంలో లక్షపూల అర్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

రంగనాథస్వామి దేవాలయంలో పూజలు

పోచారం: యమ్నంపేట్‌లోని రంగనాథస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలను ఆలయ చైర్మన్ పోలగోని రాజేష్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. తెల్లవారుజామున 4గంటల నుంచే భారీ క్యూలు కనిపించాయి. వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకుని ఉత్తరద్వారం గుండా స్వామివారిని దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ అర్చనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈఓ భాగ్యలక్ష్మి పర్యవేక్షించారు. అలాగే, సంస్కృతి టౌన్‌షిప్‌లోని శ్రీగిరివేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు సౌజన్యంతో ఆలయంలో పుష్పాలంకరణ చేశారు.



ఎదులాబాద్‌లో స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



గౌడవెల్లి రామానుజ ఆలయంలో పూజలు



దమ్మాయిగూడలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు



జయదర్శిని వేంకటేశ్వరాలయంలో భక్తుల రద్దీ

'కిలోమీటర్ రోడ్డు... రెండేళ్లయినా పూర్తి కాలేదు'

- జవహర్‌నగర్ ప్రధాన రహదారిని నిర్మించాలని బీజేపీ డిమాండ్



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జవహర్‌నగర్ బీజేపీ నాయకులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ ప్రధాన రహదారిని తక్షణమే నిర్మించాలని జవహర్‌నగర్ బీజేపీ నాయకులు సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లోని ప్రధాన రహదారిని 100 ఫీట్లతో రోడ్డు నిర్మిస్తామని చెప్పి దాదాపు ఎనిమిదేళ్లు అయ్యిందన్నారు. రోడ్డు పనులు ప్రారంభించి దాదాపు రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు.

◆ రోడ్డు విస్తరణ చేయకుండా నాణ్యత లోపంతో డివైడర్ వేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదన్నారు. కేవలం కిలోమీటర్ రోడ్డు వేయడానికి సంవత్సరాలు గడుస్తున్నాయని విమర్శించారు. వెంటనే స్పందించి ఓ స్పష్టమైన ప్రణాళికతో 100 ఫీట్లతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమల్, మల్లేష్‌గౌడ్, మహేశ్వరిగౌడ్, రామ్‌నాయక్, సన్నీ, రాఘవేంద్రచారి, సుజాత, రాజునాయక్, లక్ష్మీరెడ్డి, స్వర్ణలత, లక్ష్మీ, బుజ్జి, శ్రీనివాస్, యాదగిరి, భానుప్రకాష్, అరుణ్, కృష్ణయ్య, కనకయ్య, మల్లిఖార్జున్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీఎస్-పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా చైతన్య

ఘట్‌కేసర్: టీఎస్ పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా చౌదరిగూడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చౌదరిగూడలో టీఎస్ పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాంనాథ్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్-పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, జిల్లా సభ్యులు నరేందర్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, సాంబమూర్తి, రాజు, మంజుల, రజిత, అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

కీసర బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ నూతన కార్యవర్గం

కీసర: కీసర మండల టీఎన్‌జీఓఎస్ బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల యూనియన్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నామని యూనియన్ జిల్లా కార్యదర్శి పి.సతీష్ తెలిపారు. అధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాంబాబు, ఉపాధ్యక్షుడిగా రాజేందర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా దశరథ్, కోశాధికారిగా దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రవీందర్‌నాథ్, కార్యవర్గ సభ్యులుగా కవిత, రాజేష్, జనార్దన్, బాల్‌నరసింహ, సయ్యద్ హాషం మీర్జా, మాధవి వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ సభ్యులు రాజు, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్‌లో ప్రభుత్వ భూములు కాపాడాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక మహిళా సమాఖ్య సభ్యులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని.. వెంటనే ప్రభుత్వ భూములను కాపాడాలని కార్మిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్‌కే మస్తాన్‌బీ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో గత తహసీల్దార్ ప్రభుత్వ భూముల్లో కంచె ఏర్పాటు చేసినా కబ్జాలు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని.. ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. అదేవిధంగా అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు కేటాయించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎస్‌కే మోరా, జిల్లా అధ్యక్షురాలు ఉమా, కార్యదర్శి రమాదేవి, లక్ష్మీ, నర్సింహ, పద్మ, రజిత, ఫాతిమా, సరిత, శారద, సరోజ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ వీఎస్‌కే రెడ్డి, ప్రొఫెసర్లు

మేడ్చల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో 2023-24 సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని వైస్‌చాన్సలర్ డా.వీఎస్‌కే రెడ్డి కోరారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు. అన్ని రాష్ట్రాల బోర్డులు, సెంట్రల్ బోర్డు, ఇతర గుర్తింపు పొందిన సంస్థల విద్యార్థులకు అవకాశాలు కలిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. యూనివర్సిటీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను ఏప్రిల్ 23 నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఆర్‌యూ కామన్ ఎంట్రెన్స్ ద్వారా ప్రతిభావంతులై విద్యార్థులకు రూ.10కోట్ల వరకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అకడమిక్ ఇయర్‌లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, పారామెడికల్, మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ కోర్సులలో చదువుకునే విద్యార్థులు దరకాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ముందస్తు అరెస్టులు సిగ్గుచేటు

ఘట్‌కేసర్: తెలంగాణలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలిండియా రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ పిలుపు మేరకు ఇందిర పార్క్ వద్ద ధర్నాకు సోమవారం కాంగ్రెస్ నాయకులు వెళ్లకుండా వారిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో వారు మాట్లాడుతూ... పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా సర్పంచుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమైందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన చేపట్టకుండా అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. పోలీసులు అరెస్టు చేసిన జనార్దన్‌రెడ్డి, రూప్‌సింగ్ నాయక్, శివాజీ నాయక్, చందర్‌సింగ్ ఉన్నారు.

◆ మేడ్చల్: పీసీసీ పంచాయత్ రాజ్ సంఘటన్ హైదరాబాద్‌లో ధర్నాచౌక్ వద్ద సర్పంచ్‌ల సమస్యలపై నిర్వహించిన కార్యక్రమానికి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లకుండా పోలీసులు కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేశారు. ముందస్తు అరెస్టులు చేయడాన్ని నాయకులు ఖండించారు. సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి సురేందర్‌ముదిరాజ్ నేతృత్వంలో కొంతమంది నాయకులు ధర్నాచౌక్‌కు తరలివెళ్లారు. అరెస్టు చేసిన నాయకులను మధ్యాహ్నం తర్వాత విడుదల చేశారు.





ఘట్‌కేసర్, మేడ్చల్ పీఎస్‌ల ఆవరణలో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

పన్నుల టార్గెట్ రూ.211.38 కోట్లు

- వసూలైన పన్నులు రూ.111.35 కోట్లు
- మార్చి కల్లా మిగిలిన వసూళ్లకు చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో స్థానిక సంస్థల (పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు) 2022-23 ఆర్థిక సంవత్సరానికి వివిధ రకాల పన్నుల రూపేనా రూ.211.38 కోట్లు వసూలు చేయాలన్న లక్ష్యంలో ఇప్పటి వరకు రూ.111.35 కోట్లు వసూలయ్యాయి. మిగతా పన్నులు రూ.100.03 కోట్లు మార్చి కల్లా వసూలు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ప్రతీ రోజు పన్నుల వసూలుపై మానిటరింగ్ చేయటం ద్వారా వంద శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

పురపాలక సంఘాల్లో పన్నుల లక్ష్యం 188.55 కోట్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏ జిల్లాల్లో లేని విధంగా మేడ్చల్ జిల్లాలో నాలుగు కార్పొరేషన్లు ఉండగా, తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. 13 పురపాలక సంఘాల నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల పన్నులను రూ.188.55 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాని ఇప్పటి వరకు రూ.99.82 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ. 88.73 కోట్లు మార్చి వరకు వసూలు చేయటానికి రోజు వారి కార్యాచరణతో అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్లు ముందుకెళ్తున్నారు.

పంచాయతీ శాఖ టార్గెట్ రూ.22.83 కోట్లు

మేడ్చల్ జిల్లాలోని ఐదు మండలాల పరిధిలోని 61 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల ద్వారా 2022-23ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.22.83 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ. 11.53 కోట్లు వసూలయ్యాయి. మిగిలిన రూ. 11.30 కోట్లు మార్చి కల్లా వసూలు చేసేందుకు పంచాయతీ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఘట్‌కేసర్ మండలంలోని 11 గ్రామాల్లో 57.93 శాతం పన్నులు వసూలు కాగా, మూడు చింతలపల్లిలోని 13 గ్రామాల్లో 46.23 శాతం వసూలైంది. అలాగే, మేడ్చల్ మండలంలోని 17 గ్రామాల్లో 40 శాతం, కీసర మండలంలోని 10 గ్రామాల్లో 41.21 శాతం, శామీర్‌పేట మండలంలోని 10 గ్రామాల్లో 39.63 శాతం పన్నుల వసూలయ్యాయి.